క్లుప్తంగా

నిత్యావసర సరకుల పంపిణీ



మహిళలకు సరకులు అందజేస్తున్న సంఘం సభ్యులు

కాకినాడ రూరల్: కోరమాండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద మహిళలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈసందర్భం సంఘ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ సంఘ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి సూచనలు మేరకు ప్రతి నెలా మాదిరిగా నిత్యావసర సరకుల పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ విశ్రాంత అధికారి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, ప్రసాద్ నాయుడు, శ్రీనగేష్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ కాలనీలో పార్కు పనులకు శంకుస్థాపన

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో పార్కు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంతం నానాజీ శనివారం శంకుస్థాపన చేశారు. జెమిని ఆయిల్స్ సీఎస్ఆర్ నిధులు సుమారు రూ.45 లక్షలతో పనులు చేపడుతున్నట్టు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. కార్యక్రమంలో జెమిని ఎడిబుల్ ఆయిల్స్ ప్రతినిధులు, స్థానికులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పూర్ణాహుతి

బోట్‌క్లబ్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం శేషహోమం, పూర్ణాహుతి, అనంతరం చక్రతీర్థోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీపుష్పయాగోత్సవం, ఈ నెల 20న సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం జరుగుతాయని ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వర రావు, తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఉప్పాలమ్మతల్లి తీర్థం

కరప: గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో 15 రోజుల ముందు నుంచి అమ్మవారి ప్రతి రూపమైన గరగలను ఊరేగించారు. శుక్రవారం రాత్రి తెల్లవార్లు గరగ నృత్యాలు, డప్పువాయిద్యాలతో జాతర నిర్వహించారు. గ్రామస్తులతోపాటు, ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ప్రతియేట చైత్రమాసంలో పౌర్ణమి రోజున కరప గ్రామదేవత ఉప్పాలమ్మతల్లి తీర్థాన్ని నిర్వహించడం ఆనవాయితీ. మహిళలు కుంకుమ పూజలు చేశారు. జెడ్పీటీసీసభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మాజీఎంపీటీసీ పెంకే సత్తిబాబు, వైస్ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, లోహిదాస్, పీఏసీఎస్ చైర్మన్ నక్కా వీరభద్రరావు పుట్టింటివారు చోడపునీడి వంశీకులు, ఆలయకమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ తదితర గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

ధర్మాన్ని ఆచరిస్తూ సన్మార్గంలో నడవాలి



కరపలో సత్సంగంలో మాట్లాడుతున్న జిల్లా ధర్మప్రచారక్ రఘు

కరప: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలంటే ధర్మాన్ని ఆచరించాలని సమరసత సేవాఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు పేర్కొన్నారు. స్థానిక నీలయ్యతోటవీధిలో శనివారం జరిగిన సత్సంగం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధర్మానికి దూరం అయినవారు నీతినియమాలు విస్మరించి, దుర్మార్గంలో జీవిస్తారని, అలా జీవించేవారు మానవత్వాన్ని మంటకలుపుతారన్నారు. ఈ సందర్భంగా భక్తులతో హనుమాన్ చాలీసా, భజన పాటలు పాడించారు. మండల మహిళాకన్వీనర్ పేకేటి లక్ష్మీకాంతం, భజన ప్రముఖ దూళ్ల సరోజిని, ధార్మికజట్టు సభ్యులు బలిరెడ్డి శేషారత్నం, చోడపునీడి అనంతలక్ష్మి, కూనపరెడ్డి మంగ తాయారు. కొమ్మన చంద్రావతి, నాగమణి, మద్దూరి వరలక్ష్మి, బలిరెడ్డి దుర్గ, తిరగంటి దుర్గాదేవి, కొల్లి రమ్మ పాల్గొన్నారు.

ఉప్పుటేరులో మత్స్యకారుడి మృతి

కాకినాడ రూరల్: కొవ్వూరు గ్రామం ఎస్సీ పేట సమీపంలో ఉప్పుటేరులో చేపల వేట సాగిస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయి వలలో చిక్కుకున్న మత్స్యకారుడు ముడే గోవిందరాజు(35)మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు వివరాల ప్రకారం.. గోవిందరాజు చేపల వేటకు శుక్రవారం మధ్యాహ్నం ఉప్పుటేరు వద్దకు వెళ్లాడు. సాయంత్రం నీటిలో గోవిందరాజు మృతదేహం కపించడంతో మృతుని సోదరుడు నాగశ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు మృతదేహం జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై సూర్యకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశాజనకంగా రబీసాగు

- ప్రారంభమైన వరికోతలు
- రైతుల్లో హర్షాతిరేకాలు
- కరప మండలంలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు



పేపకాయలపాలెం వద్ద యంత్రంతో వరి కోతలు

కరప: ఈ ఏడాది రబీ పంట ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలించడంతో పంట బాగుందని, వరుణుడు కరుణిస్తే మరో రెండు, మూడు వారాల్లో పంట చేతికి అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది తొలకరిలో సాగునీటి సమస్యలు ఎదురవడంతో రైతులు దాళ్వా సాగు ఎలాగుంటుందోనని ఆందోళన చెందారు. అయినా కోటిఆశలతో రబీ సాగు చేశారు. మండలంలో ప్రధానంగా ఉండే పంట కాలువలు సంపరబోది, గరువుకాలువ, యండమూరు చానల్, వెల్ల నార్త్ కెనాలు, న్యూభీమన్న కర్రకాలువ, కేఎంజే కెనాలు తదితర పంట కాలువల ద్వారా సాగునీరు సరఫరావుతుంది.

సాగునీటి ఎద్దడి ఏర్పడినా..

ప్రతి ఏటా రబీలో సాగునీరు ఎద్దడితో రైతులు సతమతమవడం పరిపాటిగా మారింది. అయినా పాలకులు, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో రబీ ప్రారంభంలో సాగునీటి ఎద్దడి ఏర్పడింది. ప్రధానంగా వెల్లనార్త్ కెనాలు పరిధిలో విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు, యండమూరు గ్రామాల్లోను, న్యూభీమన్నకర్రకాలువ, గరువుకాలువ పరిధిలో కరప, వలసపాకల, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరిపల్లి తదితర గ్రామాల్లో సాగునీటి ఎద్దడిని ఎదుర్కొన్నారు. సీజన్ చివరిలో కొంగోడు చానల్ పరిధిలో వలసపాకల, కొంగోడు గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాగునీటి సమస్యపై ఫిబ్రవరి, ఏప్రిల్‌లో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాలకు కలెక్టర్, జేడీఏలు స్పందించి ఇరిగేషన్, వ్యవసాయ శాఖాధికారులను కాలువలపైకి పంపించి, పంట పొలాలు తడిసేలా చేశారు.

పెట్టుబడి రూ 34 వేల వరకూ..

మండలంలో సుమారు 14 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. రైతులు ఎంటీయూ–3626(బొండాలు) ఎక్కువగా సాగు చేశారు. ఎకరానికి ఇంతవరకు రూ.30 వేలు నుంచి రూ.34 వేలు వరకు పెట్టుబడులు పెట్టినట్టు రైతులు చెబుతున్నారు. ముందుగా ఊడ్చిన వరిచేలు పక్వదశలోను, లేత చేలు పాలుపోసుకుని, గింజగట్టిపడే దశలోను ఉన్నాయి. వాతావరణం మరో రెండు వారాలు అనుకూలిస్తే ఎకరానికి 45 నుంచి 60 బస్తాలు దిగుబడి రావచ్చని రైతులు అంచనా వేస్తున్నారు.

వరికోతలు ప్రారంభం

మండల పరిధిలో ముందుగా ఊడ్చిన పొలాల్లో వరి చేలు పక్వ దశకు చేరుకోగా రైతులు కోతలకు సిద్ధమవుతున్నారు. కొత్తఅమావాస్య తర్వాత పౌర్ణమి కూడా వెళ్లడంతో కోతల ప్రారంభమయ్యాయి. పేపకాయలపాలెం, కూరాడ, వాకాడ, వేళంగి, అరట్లకట్ట తదితర గ్రామాల్లో రైతులు రబీకోతలు ప్రారంభించారు. మెషీన్‌తో కోయించడానికి ఎకరాకు రూ.3 వేలు నుంచి రూ.3,500 తీసుకుంటున్నారు. మనుషులతో కోయించడానికి మగవారికి రూ.900, మహిళా కూలీకైతే రూ.600 తీసుకుంటున్నట్టు రైతులు తెలిపారు.

15 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



రైతు పండించిన పంటకు మద్దతు ధర అందించేందుకు కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా కరప మండలంలో 15 రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. సాధారణ రకమైతే క్వింటాల్ రూ.2,300, 75 కిలోల బస్తాకు రూ.1,725, గ్రేడ్–ఎ రకమైతే క్వింటాల్‌కు రూ.2,340, 75 కిలోల బస్తాకైతే రూ.1,740 మద్దతు ధర అందిస్తారు. పంట పక్వ దశకు వచ్చాక, కోయాలని, తేమ 17 శాతం లోపు ఉండేలా ఆరబెట్టుకోవాలి. మిషన్‌తో కోయించుకుంటే పెట్టుబడి ఖర్చు ఎకరానికి రూ.నాలుగైదు వేలు తగ్గుతుంది. ఆర్ఎస్‌కేల ద్వారా అమ్మకాలు జరిపితే మద్దతు ధర లభిస్తుంది. రబీకోతలకు నాలుగైదు రోజులు ముందు అపరాలు, పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి. పండితే అదనపు ఆదాయం వస్తుందని, వాతావరణం అనుకూలించకపోతే అపరాల మొక్కలతో భూమి సారవంతమవుతుంది.

– ఏవీ రాజేష్, వ్యవసాయాధికారి, కరప మండలం

దాళ్వా పంట ఆశాజనకంగా ఉంది



ఈ ఏడాది రబీపంట ఆశాజనకంగా ఉంది. రబీ ప్రారంభంలో సాగునీటి సమస్య వచ్చింది. ఇంజిన్లతో తోడి తడపాల్సి వచ్చింది. వంతుల వారీ విధానం కూడా పర్యవేక్షణ లేక సక్రమంగా జరగలేదు. ముదరగా నాటిన చేలు కోతకు వచ్చాయి. వాతావరణం అనుకూలిస్తే పండిన పంట చేతికొస్తుంది.

– వెలుగుబంట్ల రవినాయుడు, రైతు, కూరాడ

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



వేళంగిలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

కరప: వేళంగిలో జరుగుతున్న బాల్య వివాహాన్ని మండల అధికారులు అడ్డుకుని, నిలిపివేశారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేస్తామని అంగీకరించి, రాసివ్వడంతో అధికారులు వెనుతిరుగారు. అధికారులు తెలిపిన వివరాలమేరకు కరప మండలం వేళంగిలో దొడ్డిపట్ల సత్తిబాబు, అరుణ దంపతులు తమకు మార్తెకు 18 సంవత్సరాలు నిండకుండానే తుని పట్టణానికి చెందిన జీని కృష్ణ కుమారుడు జీని జగదీష్‌తో వివాహం చేస్తున్నట్టు సమాచారం రావడంతో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ, ఎంపీడీఓ ఎం.అనుపమ, సీడీపీఓ వై.లక్ష్మి, కరప ఎస్ఐ టి.సునీత, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు వేళంగి వెళ్లి, మధ్యవర్తుల సమక్షంలో తల్లిదండ్రులతో అధికారులు సమావేశమై బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలు, యుక్తవయసు రాకుండా వివాహం చేయడం వల్ల మహిళల్లో ఎదురయ్యే దుష్ఫలితాలు వివరించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో 18ఏళ్లు నిండే వరకు వివాహం జరిపించమని, అంగీకార పత్రంపై సంతకాలు చేశారు.

గురజనాపల్లిలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్



అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

కరప: గురజనాపల్లిలో శనివారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో కలిసి ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తున్నారు. పాఠశాలల్లో వసతులు, అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనపథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, షూస్, టై, బెల్ట్‌లు ఉచితంగా అందజేస్తున్నట్టు వివరించి తల్లిదండ్రులను చైతన్యపరచారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రాగా అడ్మిషన్ పత్రాలను అధికారులు, ఉపాధ్యాయులు అందజేశారు. హెచ్ఎం ఎం.సాయిమోహన్, స్టాఫ్‌సెక్రటరీ ఐ.ప్రసాదరావు, వీవీ రమణమూర్తి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘నా ఎంపిక నా హక్కు’ పై కళాజాతా



కాకినాడ కచేరిపేటలోని జాతా నిర్వహిస్తున్న ఐద్వా సభ్యులు

కాకినాడ సిటీ: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) దేశ వ్యాప్త పిలుపులో భాగంగా కాకినాడ జిల్లాలో ‘నా ఎంపిక నా హక్కు’ అనే అంశాన్ని తీసుకొని నిర్వహిస్తున్న ఐద్వా జాతా శనివారం కాకినాడ కచేరిపేట, డ్రైవర్స్‌కాలనీ, స్వామినగర్, చినస్వామినగర్‌ల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐద్వా సహాయ కార్యదర్శి సీహెచ్ రమణి, జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 76 దాటినా ఇప్పటికీ అమ్మాయిలకి జీవిత భాగస్వామిని ఎన్నుకునే స్వాతంత్రం లేదన్నారు. వారు వివాహం చేసుకుంటే పరువు హత్యలు, గౌరవ హత్యలు పేరుతో మన రాష్ట్రంలో తల్లిదండ్రులు అతికిరాతకంగా చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. సామాజిక న్యాయం, సమానత్వ సాధన కోసం ఈ జాతా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సామాజిక సమానత్వం సాధించాలంటే సంఘ సంస్కర్తలైన జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు స్ఫూర్తితో మహిళలందరూ చైతన్యవంతులై కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.భూలక్ష్మి, ఐ.దుర్గా, కె.దుర్గాదేవి, పద్మ, దేవుడమ్మ, గౌరీ, లోవ తదితరులు నాయకత్వం వహించారు.

సమాజ సేవే రోటరీ సభ్యుల వ్యక్తిత్వ మార్గం



ప్రముఖ వైద్యులు త్రిమూర్తులు రాయుడును సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ సభ్యులు సేవే మార్గంగా జీవనం సాగిస్తున్నారని ప్రముఖ వైద్యులు త్రిమూర్తులు రాయుడు అన్నారు. రోటరీగోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశంలో శనివారం స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్షుడు శిస్లా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. మానవ సేవే మాధవసేవగా నిత్యం సమాజానికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక బాధ్యతను నెరవేర్చడమే కాక సమష్టిగా ఐక్యమత్యంతో అద్భుతాలు సృష్టిస్తున్నారన్నారు. మానవ జీవితంలో గెలుపు, ఓటములు సహజమన్నారు. అలాగని మంచి, చెడులు కూడా నిత్యం ఎదురవుతాయన్నారు. వాటిని సక్రమంగా అర్థం చేసుకొని ఆచరణలోకి పెట్టుకుంటే విజయాలు సాధించవచ్చన్నారు. మన జీవితం ఎలా ఉండాలో నిర్ణయించుకోవడం మన చేతిలోనే ఉంటుందని వచ్చిన అవకాశాలు సానుకూలంగా అర్థం చేసుకుంటూ ప్రయత్నం చేస్తే గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారన్నారు. అనంతరం వైద్యులు రాయుడును రోటరీ మాజీ గవర్నర్ ఎస్వీఎస్‌రావు, టీవీ బాలకృష్ణ, సభ్యులు నయనా శ్రీరామ్, ధనసాగర్ ప్రసాద్ సత్కరించారు.

10 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

కాకినాడ రూరల్: కొవ్వూరులో పేకాట శిబిరంపై ఇంద్రపాలెం పోలీసులు దాడి చేశారు. సమాచారం మేరకు ఎస్సై సూర్యకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం మధ్యాహ్నం దాడి నిర్వహించగా 10 మంది పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.42750 స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ అమరావతి కృషి చేస్తుందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. కాకినాడ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ పెన్షనర్ల భవనాన్ని బొప్పరాజు వెంకటేశ్వర్లు సందర్శించారు. పెన్షనర్స్ భవనానికి విచ్చేసిన ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్‌కు పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి, అధ్యక్షులు కె.పద్మనాభం, ప్రధాన కార్యదర్శి నూకరాజులు స్వాగతం పలికారు. ముందుగా పెన్షనర్ల పితామహుడు నగరా విగ్రహానికి బొప్పరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు పద్మనాభం అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొప్పరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో గత నెల 23వ తేదీన ప్రవేశపెట్టి ఆమోదించిన బిల్లుపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పింఛనుదారులకు ఇబ్బంది కలిగిన పక్షంలో ఏపీ జేఏసీ ముందుండి పోరాటం చేస్తుందని పెన్షనర్స్‌కి భరోసా ఇచ్చారు. పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన ఢిల్లీలో జరిగే సమావేశానికి హాజరై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బొప్పరాజు వెంకటేశ్వర్లను సంఘ సభ్యులు సత్కరించారు. ఈ సమావేశంలో ఏపీజేఏసీ రాష్ట్ర నాయకులు ఫణిపేర్రాజు, రాజేష్, ఎస్ శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, రామమోహన్, వెంకటరావు, రాంబాబు, ఆదినారాయణరావు, ప్రసాదరావు, భాస్కరరావు, అజీజుల్లా, సాజిదా, ఇబ్రహీం, విశ్వేశ్వరరావు, నరసింహరావు, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పచ్చనేతల తీరు



8వ డివిజన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బోట్‌క్లబ్: రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరును పలువురు తప్పుబడుతున్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక 8వ డివిజన్ ప్రగతి కళాశాల ప్రాంగణం వద్ద ఆ ప్రాంతానికి చెందిన కొందరు యువకులు శనివారం ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా దానిని తొలగించాలని అధికార పార్టీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చారు. అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరిస్తున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన యువకులను స్టేషన్‌కు రావాలని బెదిరిస్తున్నారు. తాము అధికార పార్టీ నాయకులమని తాము ఏమి చెప్పితే అది చెల్లుతుందని, ఏదైనా చేస్తామని పచ్చనేతలు బెదిరిస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసింది తామేనని అందుకే ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని, దీనికి కూడా రాజకీయ రంగులు పులిమి ఫ్లెక్సీ తీసివేయమనడం ఎంతవరకూ సమంజసమని ఈ ప్రాంత యువకులు వాపోతున్నారు. అధికార పార్టీకి చెందిన వారు ఈ ప్రాంతంలో 10కి పైగా ఫ్లెక్సీలు కట్టిన ఏమీ అనని పోలీసులు తాము ఒక ఫ్లెక్సీ కడితే ఎందుకు అడ్డు పడుతున్నారో అర్థం కావడం లేదని వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి బళ్ల సూరిబాబు ఆవేదన చెందారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి

కాకినాడ సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఇంద్రపాలెం లాకుల కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద జయంతి జరుగుతాయని తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకులం విద్యార్థినుల ప్రతిభ



హేమసౌజన్య (958/1000)



అమృతవాణి (935/1000)



స్రవంతి (925/1000)



మౌనిక (923/1000)



దుర్గారాము (877/1000)



వరలక్ష్మి (431/470)



సాయిబాల అచ్యుత (971/1000)



అనంత (970/1000)

కాకినాడ రూరల్: పి.వెంకటాపురంలోని సాంఘిక సంక్షేమ శాఖ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాల విద్యార్థినులు ఇంటర్మీడియెట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చూపారు. సీనియర్ ఇంటర్‌లో నూరు శాతం, జూనియర్ ఇంటర్‌లో 98.5శాతం ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ సుశీల శనివారం తెలియజేశారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో అత్యధికంగా 454 మార్కులు, బైపీసీలో 427మార్కులు, సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో అత్యధికంగా 970 మార్కులు, బైపీసీలో 971మార్కులను తమ విద్యార్థులు సాధించారని ఆమె వివరించారు. జూనియర్ ఇంటర్‌లో 400 మార్కులు పైబడి 22 మంది, సీనియర్ ఇంటర్‌లో 900 మార్కులు పైబడి 22 మంది సాధించారన్నారు. సీనియర్ ఇంటర్‌లో పరీక్ష రాసేందుకు 67 మంది హాజరయ్యారని వీరంతా ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 70 మందికి 69 మంది పాసయ్యారన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థినిలను ప్రిన్సిపాల్ సుశీల అభినందించారు.

బైపీసీలో 971 మార్కులు

గురుకుల పాఠశాలలో బైపీసీ విద్యను అభ్యసించిన సీతానగరం మండలం సీతానగరం గ్రామానికి చెందిన కోండ్రపు సాయి బాల అచ్యుత అత్యధికంగా 971 మార్కులు సాధించింది. బొమ్మూరులో 7 నుంచి పది వరకు బొమ్మూరు గురుకుల పాఠశాల విద్యను అభ్యసించిన అచ్యూత ఇంటర్మీడియెట్ పి.వెంకటాపురంలో విద్యను అభ్యసించింది. వెనకబడిన తరగతులకు చెందిన అచ్యూత తండ్రి రామకృష్ణ మృతి చెండడంతో తల్లి అనంతలక్ష్మి ఇద్దరు అమ్మాయిలను కూలి పని చేసుకుని చదివిస్తోంది. పెద్దామ్మాయి పుష్పశ్రీలత నర్సింగ్ చేస్తుండగా చిన్నమ్మాయి అచ్యూత ఏపీఈఏపీ సెట్‌కు పరీక్షలకు సిద్ధమవుతున్నట్టు తల్లి అనంతలక్ష్మి తెలిపారు.

ఎంపీసీలో 970 మార్కులు

యానాం నామవాని పాలెంకు చెందిన కలవల అనంత పి.వెంకటాపురం గురుకుల పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ అభ్యసించి అత్యధికంగా 970 మార్కులు సాధించింది. పదో తరగతి ప్రైవేట్ స్కూల్‌లో చదివిన అనంత ఇంటర్ గురుకులంలో చదివింది. తండ్రి అర్జున్ వ్యవసాయం చేస్తుండగా తల్లి నామమణి గృహిణి, తమ్ముడు శ్యామ్ కిశోర్ ఆరో తరగతి చదువుతున్నాడు. సాఫ్ట్ వేర్ ఇంజినీరు అవ్వాలన్నదే తన ధ్యేయమని విద్యార్థిని అనంత పేర్కొన్నారు.

ఏపీఎస్పీ జెడ్పీ హైస్కూల్ ప్లస్ 40.48శాతం ఉత్తీర్ణత

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులు సీనియర్ ఇంటర్ ఫలితాలలో 40.48శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో 16మంది విద్యార్థులకుగాను 7, బైపీసీలో 25మందికి గాను 10మంది ఉత్తీరణ సాధించారు. ఎంపీసీలో అత్యధికంగా కోర్ని ఏసురత్నం 743 మార్కులు, బైపీసీలో బొడ్డేడ పూర్ణిమ 873 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌కు సంబంధించి 35.14శాతం మంది విద్యార్థులు విజయం సాధించినట్టు ప్రిన్సిపాల్ గాయత్రి తెలియజేశారు.

వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

కరప: వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో 84 శాతం, ప్రథమ సంవత్సరంలో 67 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ బీకేఆర్ చౌదరి శనివారం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 58 మంది విద్యార్థులు పరీక్షరాలుగా 39 మంది ఉత్తీర్ణులై, 67 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 63 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 53 మంది పాసై 84 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎం.హేమసౌజన్య సెకండ్ ఎంపీసీలో వెయ్యికి 958 మార్కులు సాధించి కళాశాల ఫస్ట్ వచ్చింది. బి.అమృతవాణి సెకండ్ సీఈసీలో వెయ్యికి 935 మార్కులతో ద్వితీయ, ఎస్.స్రవంతి సెకండ్ సీఈసీ 925 మార్కులతో తృతీయ, కె.మౌనిక సెకండ్ ఎంపీసీలో 923 మార్కులతో నాలుగో స్థానం, జి.దుర్గారాము బైపీసీలో 877 మార్కులతో ఐదో స్థానం వచ్చినట్టు ప్రిన్సిపాల్ చౌదరి తెలిపారు. ఫస్ట్ ఇయ్యర్ ఇంటర్‌లో గొల్లపల్లి వరలక్ష్మి 431 మార్కులతో ఫస్ట్ వచ్చినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కరపలోని నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 43 శాతం, సెకండియర్‌లో 26 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

దాసాంజనేయస్వామికి పూజలు



హోమం నిర్వహిస్తున్న పురోహితుడు మధ్వేష్

బోట్‌క్లబ్: హనుమాన్ జయంతి సందర్భంగా స్థానిక గొడారిగుంట జర్నలిస్ట్ కాలనీలో ఉన్న రమా సహిత సత్యదేవ మందిరంలో శనివారం దాసాంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారికి హోమాలు నిర్వహించారు. దాసాంజనేయస్వామి వారికి మధు అభిషేకం, తమలపాకు పూజ, అనంతరం విశేస పుష్పాలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్వేష్ మాట్లాడుతూ ఉత్తరాధి మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామిజీ ఆశీస్సులతో హనుమాన్ జయంతి కార్యక్రమాన్ని భక్తులు సహకారంతో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో మధ్వసభ కార్యదర్శి శేషగిరిరావు, సభ్యులు నందగిరి ప్రవీణ్‌కుమార్, జాగీర్ధార్ ప్రేమ్ కుమార్, రాచూరి శేషగిరిరావు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

కాకినాడ రూరల్: రోజురోజుకి ఎండల తీవ్రత పెరుగుతున్నందున దాతలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ నాయకులకు పిలుపునిచ్చారు. రమణయ్యపేటలో అన్నపాల ఆంజనేయ రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, పుల్ల శ్రీరాములు, రాయుడు అనిల్, కెవిపి బాలాజీ, సతీష్, రాజా, చింతపల్లి సుబ్బారావు, ఎస్ శ్రీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు ఫ్యాన్ల వితరణ



అంబేడ్కర్ హాస్టల్‌కు ఫ్యాన్లు బహుకరిస్తున్న రాంబాబు, వెంకటరావు

కాకినాడ సిటీ: సమాజంలో ఉన్నతంగా ఎదిగిన ప్రతి ఒక్కరూ పే బ్యాక్ టూ సొసైటీలో భాగంగా పేదరికంగా ఉన్న వారికి తమ వంతు సహకారం అందించాలని రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు, అంబేడ్కర్ సేవా కేంద్రం వ్యవస్థాపకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం కాకినాడ బాలాజీ చెరువు సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో గుబ్బల రాంబాబు, సొంబత్తుల వెంకట్రావుల ఆధ్వర్యంలో వసతి గృహానికి ఫ్యాన్ల బహూకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇదే వసతి గృహంలో చదువుకుని రాంబాబు, వెంకట్రావు వసతి గృహానికి 35 సీలింగ్‌ఫ్యాన్లు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని భవన పునర్మిణ కమిటీ అధ్యక్షుడు పిల్లి రామారావు, బీఎస్ఎన్ మూర్తి అన్నారు. మొదటి దఫా రూ.50 వేలు విలువైన 30 ఫ్యాన్లను నిర్వాహకులకు అందించారు. విశ్రాంతి ప్రిన్సిపాల్ చంద్రరావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, శేఖర్, రమేష్, కలవల వెంకటేశ్వరరావు, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.